క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరం



బాన్సువాడ: మున్సిపాలిటీ పరిధిలో సెవెన్ హిల్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఉచిత వైద్య శిబిరాన్ని డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి ప్రారంభించారు. పేదవారికి ఉచిత వైద్యం అందిస్తున్నందుకు ఆస్పత్రి సిబ్బందికి భాస్కర్ రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నాయకులు మోహన్‌నాయక్, ఎజాస్, శ్రీధర్, పాత బాలకృష్ణ, బుల్లెట్‌రాజు తదితరులు ఉన్నారు.

భిక్కనూరులో..

భిక్కనూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర వసతి గృహంలోని భిక్కనూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితం మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యుడు ఆదర్శ్, హాస్టల్ వార్డెన్ సునీత, తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలో ..

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో భారతీయ విద్యార్థి మోర్చా ఆధ్వర్యంలో స్మైల్ కేర్ మల్టీ స్పెషాలిటీ డెంటల్ ఆస్పత్రి సహకారంతో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. దంత సమస్యలపై అవగాహన కల్పించారు. ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం, వైద్యులు వినోద్ కుమార్, సౌమ్యలత, రమ్య, భారతీయ విద్యార్థి మోర్చ రాష్ట్ర కార్యదర్శి విఠల్ పాల్గొన్నారు.

బోర్లం క్యాంపు తండాలో..

బాన్సువాడ రూరల్: బోర్లంక్యాంపు తండా జీపీలో హన్మాజీపేట్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మురికినీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నాయకులు పీర్యానాయక్, ఉప సర్పంచ్ సాయిలు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

సోషల్ ఆడిట్‌పై సమీక్ష

రాజంపేట: శేర్‌శంకర్ తండా, గుండారం, ఎల్లాపూర్ తండాలలో 2022–23 సంవత్సరానికి సంబంధించి ఎన్‌ఆర్‌ఈజీఎస్ సోషల్ ఆడిట్ నిర్వహించారు. రూ.2 కోట్ల 80 లక్షల విలువైన పనులపై సోషల్ ఆడిట్ నిర్వహించినట్లు ఎంపీడీవో బాలకిషన్ తెలిపారు.

పల్లె పల్లెకు కాంగ్రెస్ ప్రచారం



లింగంపేట(ఎల్లారెడ్డి): పల్లె పల్లెకు కాంగ్రెస్‌లో భాగంగా శుక్రవారం లింగంపేట మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో టీపీసీసీ ఉపాధ్యక్షుడు మదన్‌మోహన్‌రావు ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నేతలు నారాగౌడ్, ఎల్లేశం, జొన్నల రాజు, తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ చర్చకు సిద్ధం

లింగంపేట(ఎల్లారెడ్డి): లింగంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో జరిగిన నిధుల దుర్వినియోగంపై బహిరంగ చర్చకు సిద్ధమని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులు ఒక పార్టీలో గెలిచి మరో పార్టీకి అమ్ముడుపోయిన నాయకులన్నారు. ఎవరు ఎంత అభివృద్ధి చేశారో చర్చకు సిద్ధమన్నారు. మదన్‌మోహన్ గురించి మాట్లాడే అర్హత వారికి లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు నారాగౌడ్, జొన్నల రాజు, రఫయోద్దీన్, సాజిద్, ఇర్ఫాన్ పాల్గొన్నారు.

చెక్‌డ్యాం ప్రారంభం

భిక్కనూరు: తిప్పాపూర్‌లో రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన చెక్‌డ్యాంను సర్పంచ్ స్వామి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం కూరగాయల పంటల సాగుపై అవగాహన కల్పించారు. రిలయన్స్ ఫౌండేషన్ రిసోర్స్ పర్సన్ రంజిత్, వీడీసీ అధ్యక్షుడు మంద నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌వోసీ చెక్కు అందజేత

గాంధారి(ఎల్లారెడ్డి): మండల కేంద్రానికి చెందిన షమీనా బేగం అనారోగ్యంతో నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. షమీనా ఆర్థిక పరిస్థితి గమనించి ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ రూ.2 లక్షల ఎల్‌వోసీ చెక్కును మంజూరు చేయించారు. చెక్కును శుక్రవారం సర్పంచ్ సంజీవ్, డీసీసీబీ డైరెక్టర్ సాయికుమార్ ఆమె కుటుంబ సభ్యులకు అందజేశారు.

ముత్యంపేట మహిళకు..

కామారెడ్డి క్రైం: దోమకొండ మండలం ముత్యంపేటకు చెందిన మహిళ అనారోగ్యంతో చికిత్స పొందుతుంటంతో ప్రభుత్వవిప్ గంప గోవర్దన్ శుక్రవారం రూ.2.50 లక్షల విలువైన ఎల్‌వోసీని అందజేశారు.

గ్రామాల్లో జన ఆరోగ్య సమితులను ఏర్పాటు చేయాలి

మద్నూర్(జుక్కల్): మద్నూర్, డోంగ్లీ మండలాల పరిధిలో గల గ్రామాల్లో జన ఆరోగ్య సమితులను ఏర్పాటు చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో శిరీష అన్నారు. మద్నూర్ మండల కేంద్రంలో శుక్రవారం వైద్య సిబ్బంది, ప్రజాప్రతినిధులతో ఆమె సమావేశం ఏర్పాటు చేశారు. జన ఆరోగ్య సమితిలు ప్రజల ఆరోగ్య వివరాలు సేకరించాలన్నారు.

బీటీ రోడ్డు వేసేదెన్నడో ?

- వర్షాకాలంలో బురదమయంగా మారుతోన్న రోడ్డు
- రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న మౌలాన్‌ఖేడ్‌వాసులు



బురదమయంగా మారిన మౌలాన్‌ఖేడ్ రోడ్డు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): మండలంలోని మౌలాన్‌ఖేడ్ గ్రామానికి బీటీ రోడ్డు లేకపోవడంతో వర్షాకాలంలో బురదమయంగా రోడ్డు మారుతోంది. వర్షాకాలం వచ్చిందంటే రోడ్డుపై నుంచి వెళ్లాలంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సి వస్తోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రం నుంచి మౌలాన్‌ఖేడ్ గ్రామానికి వెళ్లే 4 కిలో మీటర్ల దారి వర్షాకాలం వచ్చిందంటే నరకాన్ని తలపిస్తోందని గ్రామస్తులు చెబుతున్నారు. బురద రోడ్డుపై ప్రయాణం చేస్తున్న సమయంలో వాహనాలు స్కిడ్ కావడంతో కాళ్లు, చేతులు గతంలో విరిగాయని వాహనదారులు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా గ్రామానికి బీటీ రోడ్డు వేయాలని అధికారులను విన్నవించినా ఇంత వరకు ఎవరూ పట్టించుకోలేదని మదన పడుతున్నారు. అధికారులు స్పందించి త్వరగా బీటీ వేసేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నిధులు మంజూరు చేయాలి



ఎల్లారెడ్డి నుంచి మౌలాన్‌ఖేడ్ గ్రామానికి బీటీ రోడ్డు కోసం ప్రభుత్వం నిధులను మంజూరు చేయాలి. ప్రయాణం చేయాలంటే చాలా ఇబ్బందిగా ఉంది. బైక్‌లు జారిపడి ప్రమాదాలు జరుగుతున్నాయి.

– రాజు, గ్రామస్తుడు, మౌలాన్‌ఖేడ్

ప్రతిపాదనలు పంపాం

మౌలాన్‌ఖేడ్ గ్రామానికి బీటీ రోడ్డు కోసం ప్రభుత్వానికి రూ.2 కోట్ల నిధులకు సంబంధించి ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే గ్రామానికి బీటీ రోడ్డు పనులను ప్రారంభిస్తాం.

– కృష్ణ, పీఆర్ ఏఈ, ఎల్లారెడ్డి

అగ్ని ప్రమాదాలపై అవగాహన



జిల్లా కోర్టు ఆవరణలో అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కామారెడ్డి టౌన్: జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో అగ్నిమాపక సిబ్బందితో శుక్రవారం జిల్లా కోర్టు ఆవరణలో అగ్ని ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు, నివారణ చర్యలు, ప్రమాదంలో చిక్కుకున్న వారిని బయటకు తీయడం, వారి ప్రాణాలు కాపాడటం లాంటి ప్రదర్శనతో అవగాహన కల్పించారు. లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్, జిల్లా కోర్టు న్యాయమూర్తి ఎస్ఎన్ శ్రీదేవి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి స్థల పరిశీలన



మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

బాన్సువాడ రూరల్: బోర్లంలో తరచూ విద్యుత్ సమస్యలు తలెత్తుతుండటంతో గ్రామస్తుల కోరిక మేరకు స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి విద్యుత్ సబ్‌స్టేషన్‌ను మంజూరు చేయించారు. దీంతో శుక్రవారం విద్యుత్ శాఖ ఏడీ శ్రీనివాసులు, ఏఈ అనిల్ కుమార్ గ్రామస్తులతో కలిసి సబ్‌స్టేషన్ కోసం స్థలాన్ని పరిశీలించారు. సర్వే చేయించి స్థలాన్ని విద్యుత్ శాఖకు బదిలీ చేయించాలని అధికారులు సూచించారు. ఏఎంసీ చైర్మన్ నర్సింహులు, ఉప సర్పంచ్ మంద శ్రీనివాస్, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, రాజేశ్వర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయం కొనసాగించడానికే గోరింటాకు పండుగ



గోరింటాకు పెట్టుకుంటున్న విద్యార్థినులు

కామారెడ్డి రూరల్: క్యాసంపల్లి ఉన్నత పాఠశాలలో శుక్రవారం గోరింటాకు పండుగను విద్యార్థులు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తాడ్వాయి శ్రీనివాస్ మాట్లాడుతూ.. సాంప్రదాయాన్ని కొనసాగించడానికి గోరింటాకు పండుగను జరుపుకుంటారని, విద్యార్థులలో ఆరోగ్యంతోపాటు ఐక్యమత్యం, స్నేహభావం, నాయకత్వ లక్షణాలు పెంపొందించడానికి గోరింటాకు పండుగ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. పూర్వపు సాంప్రదాయాన్ని రాబోయే తరాలకు అందించాలని సదుద్దేశంతో పాటు గోరింటాకు పెట్టుకోవడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను పిల్లలకు అందించాలనే భావనతో గోరింటాకు ఉత్సవాన్ని నిర్వహించినట్లు తెలిపారు.

గ్రామాల్లో ఎస్ఎస్‌జీ సర్వే

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో శుక్రవారం ఎస్ఎస్‌జీ(స్వచ్ఛ్ సర్వేక్షణ్ గ్రామీణ్)–2023 సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా పంచాయితీ కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. ఎస్ఎస్‌జీ కింద సదాశివనగర్‌తో పాటు జిల్లాలో మరో 14 జీపీలను ఎంపిక చేశారన్నారు. ఈ సర్వేలో ఇంటింటికి వెళ్లి మరుగుదొడ్లు, కుటుంబ సభ్యుల వివరాలు, తదితర వివరాలు నమోదు చేశారు.

లైసెన్స్ తీసుకోవాలి

కామారెడ్డి టౌన్: పట్టణంలో సెప్టిక్ ట్యాంక్ డిసల్డింగ్ వాహనాలు కలిగిన యజమానులు మున్సిపల్ కార్యాలయం నుంచి లైసెన్స్‌లు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ దేవేందర్ శుక్రవారం తెలిపారు. అన్ని ధ్రువపత్రాలతో మున్సిపల్ కార్యాలయంలోని సానిటరీ విభాగంలో లైసెన్స్‌లు పొందాలని సూచించారు. వివరాలకు 7382330111, 8688110783ని సంప్రదించాలన్నారు.

పెండింగ్ బకాయిలు చెల్లించాలి



భిక్కనూరులో ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులు



నాగిరెడ్డిపేట: మాట్లాడుతున్న ఏఐటీయూసీ నేత

పెండింగ్ బకాయిలు చెల్లించాలని కోరుతూ మధ్యాహ్న భోజన కార్మికులు జిల్లా వ్యాప్తంగా ఎంఈవో కార్యాలయాల ఎదుట శుక్రవారం ఆందోళనలు నిర్వహించారు. ప్రభుత్వం పెంచిన గౌరవ వేతనం వెంటనే చెల్లించాలని, అలాగే కోడిగుడ్లను ప్రభుత్వమే సరఫరా చేయాలని, కొత్త మెనూ ప్రకారం పిల్లల స్లాబ్ రేట్లను పెంచాలని, వంట పాత్రలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే సామాజిక భద్రత, బీమా సౌకర్యం, పీఎఫ్, ఈఎస్ఐ కల్పించాలని కోరారు. – సాక్షి నెట్‌వర్క్



మద్నూర్‌లో తహసీల్దార్‌కు విన్నపం



మాచారెడ్డిలో ఆందోళన చేస్తూ..

ప్లాస్టిక్ నిషేధానికి విద్యార్థులు కృషి చేయాలి



అవగాహన కల్పిస్తున్న ఎంపీవో మలహరి

కామారెడ్డి రూరల్: ప్లాస్టిక్ నిషేధానికి విద్యార్థులు కృషి చేయాలని ఎంపీవో మలహరి సూచించారు. శుక్రవారం గర్గుల్ హైస్కూల్‌లో పారిశుధ్యంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు ప్లాస్టిక్ కవర్లను బయట వేయకుండా ఓ ప్లాస్టిక్ బాటిల్లో వేసి చెత్త ట్రాక్టర్‌రాగానే వారికి ఇవ్వాలన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలతో బయో బ్రిక్ తయారు చేస్తారన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాజనర్సింహారెడ్డి, గ్రామ కార్యదర్శి శోభ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని వినతి

కామారెడ్డి టౌన్: బిచ్కుంద మండలం ఫత్లాపూర్ ప్రభుత్వ పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న విద్యార్థినిపై లైంగిక దాడికి పాల్పడిన ఉపాధ్యాయుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నాయకులు శుక్రవారం డీఈవో ఎస్.రాజుకు వినతి ప్రతం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ కృష్ణ, నగర కార్యదర్శి చరణ్, తదితరులున్నారు.

కళాశాల సమస్యలు పరిష్కరించండి



కామారెడ్డి టౌన్: జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ జనసమితి ఆధ్వర్యంలో శుక్రవారం ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాంకు వినతి పత్రం అందజేశారు. విద్యార్థులకు పుస్తకాలు ఇప్పటికీ అందలేదని, మండల కేంద్రాలలో కళాశాలలు లేని చోట ఏర్పాటు చేయాలన్నారు. కుంబాల లక్ష్మణ్ యాదవ్, పూల్‌సింగ్ తదితరులున్నారు.

అభివృద్ధి కష్టంగా మారింది

బీబీపేట: రెండేళ్లుగా ఎస్ఎఫ్‌సీ నిధులు అరకొరగా అందుతున్నందున గ్రామాల అభివృద్ధి కష్టంగా మారిందని వివరిస్తూ మండల సర్పంచులు ఎంపీడీవో పూర్ణ చంద్రోదయ కుమార్‌కు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఇప్పటికైనా నిధులు షరతులు లేకుండా విడుదల చేయాలని కోరారు.

‘లెగ్యూమ్ జాతి పశుగ్రాసాలు వాడాలి’



కామారెడ్డి రూరల్: పాల ఉత్పత్తులను పెంపొందించుకోవడం కోసం పాడి రైతులు లెగ్యూమ్ జాతి పశుగ్రాసాలను వాడాలని జిల్లా పశువైద్యాధికారి సింహారావు సూచించారు. పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం గర్గుల్‌లో రైతులకు పశుగ్రాస రకాలపై అవగాహన కల్పించారు. ఎండు గడ్డితో పాటు లెగ్యూమ్ రకం పశు గ్రాసాలు వాడాలని సూచించారు. తద్వారా పాల ఉత్పత్తి పెరగడమే కాకుండా దాణా ఖర్చులు తగ్గుతాయన్నారు. 10 రకాల పశుగ్రాసాల గురించి వివరించారు. సమావేశంలో ఏడీ సంజయ్, మండల పశు వైద్యాధికారి రవికిరణ్, ఏఎంసీ డైరెక్టర్ భీంరెడ్డి, రైతు సమన్వయ కమిటీ అధ్యక్షుడు సాయాగౌడ్ పాల్గొన్నారు.

పాత కక్షలతో మక్కచేనులో గడ్డి మందు పిచికారీ

గాంధారి(ఎల్లారెడ్డి): రాంపూర్ గడ్డ తండాలో పాత కక్షలతో మక్క చేనులో గడ్డి మందు పిచికారీ చేశారని శుక్రవారం బాధిత రైతులు దండ్ల వెంకటి, ఒడ్డె పెద్ద లింగం ఫిర్యాదు చేసినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. గ్రామానికి చెందిన దస్తగిరి ఎల్లయ్య, లింగం, రమేష్‌లు తమ పొలంలో గడ్డి మందు పిచికారి చేశారని బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు మేరకు మక్క చేనును పరిశీలించి పంచనామా చేసినట్లు తెలిపారు. విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఎస్సై పేర్కొన్నారు.


పోస్టర్ల ఆవిష్కరణ

బిచ్కుంద(జుక్కల్): మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాలో నిర్వహించే అఖండ శివనామ సప్తాహం కార్యక్రమం పోస్టర్లను హైద్రాబాద్‌లో సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. బిచ్కుంద బండాయప్ప మఠం పీఠాధిపతి సోమాయప్ప స్వామి ఆధ్వర్యంలో సప్తాహం నిర్వాహకులు హైద్రాబాద్‌లో సీఎంను కలిసి పోస్టర్లు ఆవిష్కరింపజేశారు. ఈ నెల 18 నుంచి 25 వరకు కార్యక్రమం జరుగుతుందని, హాజరు కావాలని సీఎంను కోరినట్లు సోమాయప్ప స్వామి తెలిపారు.

కొనసాగుతున్న జీపీ కార్మికుల సమ్మె



లింగంపేట ఎంపీడీవో కార్యాలయం వద్ద భిక్షాటన చేస్తున్న జీపీ కార్మికులు



బిచ్కుంద: మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గంగారాం

సాక్షి నెట్‌వర్క్ : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జీపీ కార్మికులు చేపట్టిన సమ్మె శుక్రవారం కూడా కొనసాగింది. రాజంపేటలో సమ్మెకు కాంగ్రెస్ నేతలు, మద్నూర్‌లో సమ్మెకు వైఎస్సార్‌టీపీ నేతలతో పాటు పలు పార్టీల నాయకులు సంఘీభావం ప్రకటించారు. మండల కేంద్రాలో శుక్రవారం భిక్షాటన చేసి జీపీ కార్మికులు నిరసన తెలిపారు. తాడ్వాయిలో బతుకమ్మ ఆడి నిరసన తెలియజేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు తమ డిమాండ్లపై వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ.. జీవో–60 ప్రకారం వేతనాలు చెల్లించాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. స్వీపర్లను రెగ్యులరైజ్ చేయాలన్నారు.

ఆధ్యాత్మికం

■ ఘనంగా బోనాల ఊరేగింపు



భిక్కనూరు: మండల కేంద్రంలో మ్యాదరి మహేంద్ర సంఘం ఆధ్వర్యంలో మహంకాళి అమ్మవారికి బోనాల పండగను శుక్రవారం నిర్వహించారు. ఊరేగింపుగా వచ్చి బోనాలు సమర్పించారు. ప్రత్యేక పూజలు చేశారు.

నస్రుల్లాబాద్‌లో పోచమ్మకు..

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండల కేంద్రంలో ఒడ్డెర సంఘం ఆధ్వర్యంలో పోచమ్మకు బోనాలను తీశారు. గ్రామ కమిటీ అధ్యక్షుడు కంది మల్లేశ్, సంఘం సభ్యులు పూజారి సాయిలు, చిన్నా రెడ్డి, లలిత, సాయవ్వ, వెంకటి పాల్గొన్నారు.

పాత బాన్సువాడలో బుర్గు మైశమ్మకు..

బాన్సువాడ: పట్టణంలోని పాత బాన్సువాడలో శుక్రవారం బుర్గుమైశమ్మ బోనాల పండగ ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో ర్యాలీగా వచ్చి బుర్గు మైశమ్మకు బోనాలు సమర్పించారు.

■ వాసవి శాకంబరి అమ్మవారికి విశేష పూజలు

కామారెడ్డి అర్బన్: ఆశాఢ మాసం సందర్భంగా స్థానిక సిరిసిల్ల రోడ్డులోని వాసవి కన్యకాపరమేశ్వరి మాతాను శుక్రవారం శాకంబరిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భజనలు నిర్వహించారు. పట్టణంలోని గల్లీ వాసవి సంఘాల ప్రతినిధులతో పాటు పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మోటూరి శ్రీకాంత్, ప్రతినిధులు పాల్గొన్నారు.

■ సరస్వతి ఆలయంలో ప్రత్యేక పూజలు

కామారెడ్డి రూరల్: ఇల్చిపూర్ శివారులో కొలువుదీరిన సరస్వతి ఆలయంలో శుక్రవారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు దత్తాద్రిశర్మ, వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో అమ్మవారికి అర్చనలు, అభిషేకాలు చేశారు. కుంకుమార్చనలు నిర్వహించి ఒడిబియ్యం పోశారు. ఈ సందర్భంగా పుట్టిన రోజు, పెళ్లి రోజు పురస్కరించుకుని విరాళాలు అందించారు. ఆలయ నిర్మాణ దాత పార్శి విఠల్‌పటేల్, భక్తులు పాల్గొన్నారు.

సమాచారం..

■ మోడల్ స్కూల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని అచ్చంపేట ఆదర్శ మోడల్ స్కూల్లో పదోతరగతి, ఇంటర్మీడియట్ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ చంద్రకళ శుక్రవారం తెలిపారు. పదో తరగతిలో ఒక సీటు, ఇంటర్మీడియట్ ఫస్టియర్ ఎంపీసీ–4, బైపీసీ–3, సీఈసీ 5 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈ నెల19 లోపు దరఖాస్తులు సమర్పించాలని కోరారు. పదోతరగతి వారికి ప్రవేశ పరీక్ష ద్వారా ఇంటర్మీడియట్ వారికి పదోతరగతి మార్కుల ఆధారంగా సీట్లు కేటాయిస్తామని చెప్పారు.

■ రేపు జ్ఞాన చైతన్యానంద స్వామి ప్రవచనాలు

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి విద్యానగర్ విశ్వనాథేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 16న ఆదివారం ఉదయం 9 గంటల నుంచి 10.30 వరకు బ్రహ్మశ్రీ జ్ఞాన చైతన్యానంద స్వామి వారితో ఆధ్యాత్మిక ప్రవచనాలు, ధార్మిక ఉపన్యాసం ఉంటాయని ఆలయ ప్రతినిధి టి.మోహన్ తెలిపారు. ప్రవచనాల అనంతరం తీర్థప్రసాదాల వితరణ, అల్పాహారం ఉంటుందన్నారు.

ఎల్పుగొండలో ముగిసిన సత్సంగం

మాచారెడ్డి: పాల్వంచ మండలం ఎల్పుగొండలోని ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో టీటీడీ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన సత్సంగ భజన శుక్రవారం ముగిసింది. శ్రీరామకోటి జప లిఖిత ప్రచారకుడు కృష్ణానందస్వామి మాట్లాడుతూ.. చెడు అలవాట్లను మాని సమాజంలో సత్ప్రవర్తన అలవర్చుకోవాలని సూచించారు.

బల్దియాలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం

కామారెడ్డి టౌన్: పట్టణంలోని అన్ని వార్డులో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక వార్డు కౌన్సిలర్లు, అధికారులు వార్డులో పర్యటించి నిల్వ ఉన్న నీటిని తొలగించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ దేవేందర్, సానిటరీ ఎస్సై రవీందర్, పర్వేజ్ తదితరులున్నారు.

పాఠశాల తనిఖీ

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): శివాపూర్ ప్రాథమిక పాఠశాలను ఎంపీపీ మాధవి శుక్రవారం తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు. విద్యార్థులకు సక్రమంగా విద్యా బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.

సంక్షిప్తం

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి

కామారెడ్డి రూరల్: జూన్ 18 వరకు పట్టా పాస్ పుస్తకాలు పొందిన రైతులతో పాటు పోడు భూములకు పట్టాలు పొందిన రైతులు వెంటనే రైతు బీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని కామారెడ్డి మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్ రావు తెలిపారు. 18 నుంచి 59 ఏళ్ల లోపు వారు ఆగస్టు 5 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులకు అభినందనలు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): అడ్లూర్‌ఎల్లారెడ్డిలోని నలంద విద్యానికేతన్‌కు చెందిన సంపత్‌కుమార్, శ్రావణ్‌లు బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపిక అయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మర్రి సదాశివరెడ్డి విద్యార్థులను శుక్రవారం అభినందించారు.

ఇళ్ల పరిసరాలలో నీరు నిల్వ ఉండకూడదు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఇళ్ల పరిసరాలలో నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని నాగిరెడ్డిపేట ఎంపీడీవో రఘు సూచించారు. జలాల్‌పూర్‌లో శుక్రవారం డ్రై డే గురించి గ్రామస్తులకు ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామసర్పంచ్ క్రిష్ణతో కలిసి గ్రామంలో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి డబ్బాలు, పాతటైర్లు, కొబ్బరిచిప్పలలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. ఎక్కువ రోజులు నీరు నిల్వ ఉంటే దోమలు గుడ్లుపెట్టి వాటి సంతతిని పెంచుకుంటాయన్నారు. దీనివల్ల ప్రజలకు సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతాయని ఆయన చెప్పారు. కార్యదర్శులు మల్లిఖార్జున్, రమ్యశ్రీ, ఆశావర్కర్లున్నారు.

ఫొటో తీసి పంపితే రూ.1,000 బహుమానం

ఎల్లారెడ్డి: మండలంలోని ఏగ్రామంలోనైనా సరే రోడ్డుపై కేజ్‌వీల్‌తో ట్రాక్టర్లు నడిపినట్లు కనిపిస్తే వాటికి సంబంధించిన ఫొటోలు, వీడియోలను పోలీసులకు పంపిన వారికి రూ.1,000 బహుమానం ఇస్తామని ఎస్సై గణేష్ శుక్రవారం తెలిపారు. రోడ్డుపై కేజీవీల్‌తో ట్రాక్టర్లు నడపడం వల్ల రోడ్లు పాడవుతున్నాయని, దీనిని దృష్టిలో ఉంచుకుని చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

స్కూల్ బ్యాగుల పంపిణీ

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని గండిమాసానిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ వారు విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, నోటుబుక్కులు, కంపాక్స్ బాక్సులు, గొడుగులను పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు, హెల్పింగ్ హ్యాండ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు తదితరులున్నారు.

ఐకేపీ ఆధ్వర్యంలో మొక్కలు..

దోమకొండ: మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో శుక్రవారం మొక్కల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ప్రతి ఇంటికి మూడు మొక్కల చొప్పున పంపిణీ చేపట్టినట్లు ఐకేపీ ఏపీఎం రాజు తెలిపారు. మండలానికి చెందిన డ్వాక్రా సంఘాల మహిళలకు మొక్కలను అందజేశామన్నారు. జెడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, ఎంపీపీ కానుగంటి శారద, సింగిల్ విండో చైర్మన్ పన్యాల నాగరాజ్‌రెడ్డి, ఐకేపీ సీసీలు ఉన్నారు.

రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలి

దోమకొండ: మండల కేంద్రంలో శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఉచిత విద్యుత్ అంశంపై రేవంత్‌రెడ్డి రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. జెడ్పీటీసీ తిర్మల్‌గౌడ్, ఎంపీపీ శారద, సీడీసీ చైర్మన్ ఐరేని నర్సయ్య, మధుసూధన్‌రావ్, తదితరులు ఉన్నారు.